
ఆంధ్రజ్యోతి



కర్నూలు
జిల్లా వార్తలు
7
ఆదివారం 19 అక్టోబరు 2025

శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కర్నూలు జేసీకి అదనపు బాధ్యతలు

నంద్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న నూరుల్ ఖమర్‌కు శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో ముఖ్యమైన ప్రాజెక్టు కావడంతో కర్నూలు జేసీకి అదనపు బాధ్యతలను అప్పగించారు.

ఎల్లెల్సీలో.. జల చౌర్యం

రైతులు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతోంది. అలాంటి అన్నదాతలకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. వాతావరణం అనుకూలించపోవడం, మార్కెటింగ్, ధరలు వంటివి ఎన్నో సమస్యలు ఉన్నాయి. వీటికి తోడు సాగునీరు అనేది కీలకమైనది. నీరుంటేనే పంటలు పండుతాయి. అలాంటి నీటిని సైతం కొందరు దొంగలిస్తున్నారు. అధికారుల కళ్లముందే సాగుతున్న తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎల్లెల్సీ పరిధిలో జలచౌర్యం జోరుగా సాగుతోంది. దీంతో ఆయకట్టు రైతులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. వర్షంపై ఆధారపడి పంటలు పండించాల్సిన పరిస్థితి నెలకొంది. కోడుమూరు సబ్‌డివిజన్‌లో సాగుతున్న జల చౌర్యంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



ఎల్లెల్సీ కాలువకు ఏర్పాటు చేసిన పైపులు, మోటార్లు

- కన్నెత్తి చూడని లస్కర్లు, అధికారులు
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- నీటిపై ఆశలు వదులుకున్న రైతులు
- మోటార్లు బిగించిన నానాయకట్టుదారులు

కోడుమూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు సబ్‌డివిజన్ పరిధిలో ఎల్లెల్సీలో జల చౌర్యం జోరుగా సాగుతోంది. చివరి ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. చాలా ఏళ్లుగా ఇదే పరిస్థితి. సబ్‌డివిజన్‌కు రావాల్సిన వాటా అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీనికి తోడు నానాయకట్టు అడ్డుఅదుపూ లేకుండా సాగవుతోంది. రైతులు కాలువ గట్టుపై మోటార్లు శాశ్వతంగా ఉంచి అక్రమంగా నీటిని వాడుకుంటున్నారు. లస్కర్లు ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో ఇష్టారాజ్యమైంది. ఒకవేళ బదిలీ జరిగినా రాజకీయ నాయకుల సిఫారసుతో కొన్నాళ్లకే తిరిగి వస్తున్నారు. కాసుల కక్కుర్తితో చివరి ఆయకట్టును ముంచారు.



సాగునీరు రావడం లేదని పులకుర్తి రైతుల ఆవేదన

1980 ముందు వరకు స్వర్ణయుగం

కోడుమూరు సబ్ డివిజన్‌కు 1980 ముందు వరకు స్వర్ణ యుగం. సబ్ డివిజన్ పరిధిలో సుమారు 50వేలు ఎకరాలకు పైగా పంట పండేది. రైతులు ఖరీఫ్, రబీ రెండు పంటలు పండించుకున్నారు. పల్లెలు ధాన్యరాశులతో కళకళలాడేవి. క్రమేణా ఆదోని 1, 2 ఎమ్మిగనూరు, గోనెగండ్ల పరిధిలో నానాయకట్టు పెరిగిపోయింది. అధికారులు చర్యలకు రాజకీయ ఒత్తిళ్ల అడ్డుకట్ట వేస్తున్నాయి. సుమారు 30 ఏళ్ల నుంచి చివరి ఆయకట్టు అంపశయ్యపై ఉంది.

కోడుమూరు సబ్ డివిజన్ పరిధిలో 5ఆర్ (డబ్బ్యా) పిల్లకాలువ దాదాపుగా కనమరుగైంది. ఈ కాలువకు ఏళ్ల తరబడి సాగునీరు అందకపోవడంతో చివరి పొలాలు చాలా వరకు ప్లాట్లుగా మారాయి. కోడుమూరులో ఈ కాలువను పూడ్చి పేదలు గుడిసెలు నిర్మించుకున్నారు. 11ఎల్ కాలువ పరిస్థితి ఇదేమాదిరిగా ఉంది. 1ఎల్, 3 ఎల్, 6 ఎల్, 7 ఎల్, 8 ఎల్ కాలువలపై నానాయకట్టు పెరిగింది. ప్రధాన కాలువను ఆనుకుని ఉన్న పొలాల రైతులు ఏకంగా కాలువ కట్టపై మోటార్లు బిగించారు.

జీడీపీ పరిధి రైతులు కూడా..

జీడీపీ పరిధి రైతులు కూడా మోటార్ల ద్వారా తరలించు కుంటున్నారు. కొన్నిచోట్ల జీడీపీ, టీబీపీ మధ్య ఖాళీ ప్రదేశాన్ని చదునుచేసి పంటలు వేస్తున్నారు. దీనినిబట్టి అధికారుల ఉదాసీనత ఎంతో అర్థం అవుతుంది. దీంతో చివరి భూముల రైతులు వర్షాధార పంటలపై ఆధారపడాల్సి వస్తోంది. రబీలో చాలా రైతు కుటుంబాలు వలస వెళ్తున్నాయి. జలచౌర్యం పెచ్చుమీరడంతో ఆయకట్టు రైతులు ఒకటి రెండు తడులకు పోరాటం చేయాల్సివస్తోంది. చివరి ఆయకట్టుకు నీరందించ డంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. కోడుమూ రు సెక్షన్ పరిధిలోనే దాదాపు రెండువేల ఎకరాల నానాయకట్టు సాగవుతోందని అంచనా. నిర్వహణ పారదర్శకంగా జరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

కాలువల ఆనవాళ్లు..

జలచౌర్యంతో చివరి ఆయకట్టుకు సాగునీరు చేరడం లేదు. దీంతో పిల్ల కాలువలకు పూడిక నిండి జంబు, పిచ్చిమొక్కలు, కంప పెరిగిపోయింది. కాలువల ఆనవాళ్లు కనిపించడం లేదు. సాగునీటిపై రైతులు ఆశలు వదులుకున్నారు. పొలం కలిసి వస్తుందని కాలువలు చదును చేసుకున్నారు. ఏళ్ల తరబడి సాగునీరు అందకపోవడంతో విసుగుచెందిన ఓ రైతు ఆయకట్టు రద్దుచేసి మెట్టభూమిగా కింద నమోదు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు.

125 క్యూసెక్కులు..

గోనెగండ్ల మండలంలోని పుట్టపాశం పరిధిలో 4/7 కి.మీ వద్ద కోడుమూరు సబ్‌డివిజన్ (ఎల్లెల్సీ కేబీసీ (కర్నూలు బ్రాంచ్ కెనాల్) ఆరంభమవుతుంది. అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 125 క్యూసెక్కులు విడుదల కావాలి. నీటి విడుదలను లస్కర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. సబ్‌డివిజన్‌లో కోడుమూరు, గూడూరు, పోలకల్లు, కె.నాగలాపురం, కర్నూలు సెక్షన్‌లు ఉన్నాయి. ప్రధాన కార్యాలయం కోడుమూరులో ఉంది. డీఈ , ముగ్గురు జేఈలు, ఇద్దరు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు లస్కర్లు, 34మంది అవుట్‌సోర్సింగ్ లస్కర్లు పనిచేస్తున్నారు. మరో 30 మందిని డైవర్షన్ కింద పంపినట్లు డీఈ తెలిపారు

సాగునీటి చౌర్యం జరగకుండా చూస్తా



కోడుమూరు సబ్ డివిజన్ ఎల్లెల్సీ కాలువ 4/7 కిమీ. నుంచి ప్రారంభమవుతుంది. సబ్ డివిజన్‌కు రావాల్సిన వాటాను అందించడానికి కృషి చేస్తాం. నానాయకట్టు తన దృష్టికి రాలేదు. సాగునీటి చౌర్యం జరగకుండా చూస్తాం.

● సుబ్బరాయుడు, డీఈ, కోడుమూరు సబ్ డివిజన్



3ఎల్ కాలువ దుస్థితి

అడుగడుగునా మోటార్లు బిగించి..

కోడుమూరు సబ్ డివిజన్ ప్రారంభమయ్యే 4/7 కి.మీ కింద నుంచి కాలువకట్టపై అడుగడుగునా మోటార్లు బిగించారు. అక్రమంగా సాగునీటిని తరలించి పంటలు పండించుకుం టున్నారు. 2ఆర్ కాలువ దగ్గర నుంచి 3ఎల్(డై) కాలువ వరకు సుమారు 50 మోటార్లు ఉన్నాయి. కాలువలో యథేచ్ఛగా పైపులు వేసి తరలిస్తున్నా లస్కర్లు, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ముడుపులతో జేబులు తడుస్తుండటమే ఇందుకు కారణం. నానాయకట్టు రైతుల దగ్గర ఎకరాకు రూ.2వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

కోర్టును ఆశ్రయించా



మాకు 3ఎల్, 7ఎల్, 8ఎల్ ఆరుతడి కింద దాదాపు 36 ఎకరాల సొంత పొలం ఉంది. ఆయా కాలువల పరిధిలో 4వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గత 25 ఏళ్లకు పైగా ఆయకట్టుకు నీరందడం లేదు. సాగునీటి కోసం ఏఈ, డీఈ, ఈఈ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. సాగునీరందక వర్షాధార పంటలపై ఆధారపడుతున్నాం. ఈ పరిస్థితుల్లో మెట్ట భూమిగా పరిగణించాలని హైకోర్టును ఆశ్రయించా.

● విజయభాస్కర్‌రెడ్డి, రైతు, పులకుర్తి

ఆడపిల్లలపై వివక్ష వద్దు

- వారిని బాగా చదివించాలి
- కలెక్టర్ డాక్టర్ సిరి
- ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుట్టిన, మగ పిల్లవాడు పుట్టినా ఇద్దరు సమానమేనని, ఆడపిల్లలపై వివక్ష వద్దని కలెక్టర్ సిరి అన్నారు. శనివారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ విజయ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువుకునే హక్కు ఉం దని, వారిని బాగా చదివించాలన్నారు. తాను ప్రస్తు తం కలెక్టర్‌గా ఉన్నాను అంటే దానికి తన తల్లియే కారణమన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులకు పిల్లల చదువు భారం కాకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 'తల్లికి వందనం' ప్రవేశ పెట్టిందన్నారు. పెద్దపాడు చిల్డ్రన్స్ హోం చిన్నారులు, శిశు గృహానికి చెం దిన చిన్నారులు ప్రదర్శించిన ఆట పాటలు, నాటకాలు ఆకట్టుకున్నాయి. గాంధీ వేషం వేసి అందరిని అలరించిన శిశుగృహ చిన్నారని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, సీపీవో భారతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జుబేదాబేగం, అగినెస్ట్ సెక్సువల్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ మాధవీ శ్యామల, జిల్లాల బాలల సంరక్షణ అధికారి టి.శారద, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

జడ్పీ సీఈవో నాసర రెడ్డి



కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశు ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి సూచించారు. నగరంలోని జడ్పీ ఆవరణలోని జిల్లా శిక్షణ వనరుల కేంద్రంలో శనివారం 'శుభ్రత- పరిశ్రభత' అనే అంశంపై జిల్లా లోని డివిజనల్ పంచాయతీ అధి కారులు, ఎంపీడీవోలు, డీపీఆర్సీ ఆర్పీలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జడ్పీ సీఈవో మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ మంజులావాణి, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీవోటీలు ఎస్.అష్రఫ్ బాషా, పి.జగన్నాథం పాల్గొన్నారు.

ఉల్లి రైతు కన్నీరు

- ధర లేక పంటలను దున్నేస్తున్న అన్నదాతలు



ట్రాక్టర్‌తో ఉల్లిని దున్నివేస్తూ శనగ విత్తనం వేస్తున్న రైతు

కోడుమూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించిన రైతుకు ఆవేదన మిగిలింది. రూ. లక్షలు ఖర్చు చేసి పంటను పండిస్తే కోత కూలీలకు గిట్టుబాటు కావడం లేదు. తల్లి చేయని మేలు ఉల్లి చేస్తుందని సామెత. అయితే మార్కెట్ మాయాజాలంతో ఉల్లి రైతులు తల్లడిల్లుతున్నారు. మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గిడ్డయ్య వర్షాధారం కింద 13 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. నాటు, కలుపులు, ఎరువులు, పిచికారీ తదితర ఖర్చులు ఎకరాకు రూ. 60 వేలు అయింది. ఇప్పుడు పంట పీకడం, కోత, కల్లం చేర్చడం, గ్రేడింగ్, మార్కెట్‌కు తరలించడం వంటి ఖర్చుల కింద మరో రూ. 20 వేలు వస్తుంది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లిపంటకు గిట్టుబాటు ధర అందడం లేదు. లభిస్తున్న ధరలతో నష్టమే తప్ప కోత ఖర్చులకు సరిపోవని రైతులు పంటను తొలగించడానికి సిద్ధపడ్డారు. శనివారం 5 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లిని ట్రాక్టర్‌తో దున్నేస్తూ శనగ, జొన్న విత్తనం వేశారు. ఆదివారం మరో 8ఎకరాల ఉల్లిని తొలగించి విత్తనం వేయనున్నట్లు రైతు తెలిపారు. ఇంటిల్లిపాది కష్టమంతా మట్టిపాలు అయ్యిందని, రూ. 7.8 లక్షలు నష్టపోయినట్లు కన్నీటిపర్యంతమయ్యారు.

13 ఎకరాల్లో సాగు చేశా



వర్షాధారం కింద 13 ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. గిట్టుబాటు ధర లభిస్తుందనే నమ్మకంతో అప్పుచేసి పెట్టుబడి పెట్టాను. నాలుగు నెలలు కంటికి రెప్పలా కాపాడుకుని పంట పండిస్తే కోత కూలీలకు గిట్టుబాటు కావడం లేదు. పంట పండించి వ్యాపారుల చేతిలో పెట్టాల్సి వస్తోంది. మార్కెట్ నుంచి ఒట్టిచేతులతో తిరిగి రావడం తప్ప మిగిలేదేమి లేదు. అందుకే పంటను దున్నివేసి వేరే పంట వేశాను.

● గిడ్డయ్య, వెంకటగిరి

24న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీన నిర్వ హించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రులు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసన సభ్యులు హాజరవుతారని వివరించారు. వ్యవసాయం అనుబంధ శాఖలు, నీటియాజమాన్య సంస్థ, మత్స్యశాఖ, దేవదాయ శాఖలపై చర్చ ఉంటుందని, ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఏసీబీ వలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

రూ.13 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన నరేశ్

పత్తికొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేశ్ శనివారం కార్యాలయంలో రూ.13 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. తుగ్గలి గ్రామానికి చెందిన ఎంపీటీసీ రాజు గత ఏడాది గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ. 1.3లక్షల విలువచేసే మట్టిరోడ్డు పనులు చేశారు. అందుకు సంబంధించి మండల పరిషత్ గ్రాంట్ ద్వారా అధికారులు బిల్లులు చెల్లించాల్సి ఉంది. రోడ్డు కొలతలను ఎంబుక్ నమోదు కోసం పనుల విలువలో 10శాతం తనకు లంచం ఇవ్వాలని ఏఈ నరేశ్ డిమాండ్ చేశాడు. తనకు పెద్దగా లాభం మిగలలేదని, 10 శాతం కాకుండా అంతో ఇంతో ఇస్తానని రాజు ఆయనను పలుమార్లు కలిశారు. 10శాతం ఇస్తేనే ఎంబుక్‌లో నమోదు చేస్తామని ఏఈ చెప్పడంతో ఎంపీటీసీ రాజు కర్నూలులో ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం పత్తికొండ సబ్ డివిజన్ కార్యాలయంలో ఉన్న ఏఈ నరేశ్ రూ.13 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సోమన్న సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ ఏఈ నరేశ్‌పై కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు శ్రీనివాసులు, రాజు, ప్రభాకర్, కృష్ణయ్య ఉన్నారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన తుగ్గలి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేశ్

జీడీపీలో 4 టీఎంసీల నీటి నిల్వ

గోనెగండ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న హంద్రీనదికి నీటి విడుదలను ఇరిగేషన్ అధికారులు గురువారం సాయంత్రం నిలిపివేశారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలకు చెందిన వాగులు, వంకల నుంచి రోజుకు 60 క్యూసెక్కుల నుంచి 70 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు హంద్రీనీవా(హెచ్ఎన్ఎస్, శ్రీశైలం బ్యాక్‌వాటర్) నుంచి నీటిని నెల రోజుల ముందు నుంచే జీడీపీకి మళ్లించడం నిలిపివేశారు. జీడీపీలో నీరు సమృద్ధిగా ఉండటంతో ఈ నిర్ణయం అధికారులు తీసుకున్నట్లు తెలిపారు. ఇక ఎల్లెల్సీ అధికారులు తుంగభద్ర దిగువ కాలువ నుంచి గత 15 రోజులుగా ప్రతి రోజు 120 క్యూసెక్కుల నీరు జీడీపీ లోకి విడుదల చేసి అందులో నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం గాజలదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రానికి నీటి మట్టం 376.72 మీటర్లు(4 టీఎంసీలు) ఉంది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.28 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4 టీఎంసీల నీరు ఉందని, ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటి కప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. రబీ సీజన్‌లో జీడీపీ ఆయకట్టు రైతులుకు నీటి ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.



గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి నిల్వ

22 నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఈనెల 22 నుంచి అండర్-14, 17 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి టి.కృష్ణ శనివారం తెలిపారు. విభాగాల వారీగా బాలబాలికలకు హాకీ, బాస్కెట్ బాల్ ఎంపిక ఉంటుందన్నారు. కర్నూలు నగరంలోని డీఎస్‌ఏ అవుట్ డోర్ ఔట్‌డోర్ స్టేడియం, కర్నూలులో ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న వాలీబాల్ డీఎస్‌ఏ స్టేడియంలో ఎంపిక ఉంటుందన్నారు. కర్నూలు మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ఈ నెల 21న (అర్బన్, రూరల్) అన్నీ క్రీడాంశాలలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డి.సుంకారావు తెలిపారు. ఈ నెల 21న బాలురు, 22న బాలికలకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాల కోసం 9885803253, 9177482702లను సంప్రదించాలన్నారు. అదేవిధంగా బాలబాలికలకు ఈ నెల 21న టెన్నిస్, ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నంద్యాల డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కృష్ణ, బి.విశ్వనాథ్ తెలిపారు.

హరికిషన్‌కు తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారం



కర్నూలు కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలల కథా రచయిత, సాహితీవేత్త డాక్టర్ ఎం.హరికిషన్ హైదరాబాద్ తెలుగు విశ్వ విద్యాలయం 'సురవరం ప్రతాపరెడ్డి పురస్కారం'కు ఎంపికయ్యారు. ఈ మేరకు వీసీ నిత్యానందరావు శనివారం లేఖ పంపినట్లు రచయిత తెలిపారు. 29న హైదరాబాదులోని ఎన్టీఆర్ కళా మందిరంలో సుప్రసిద్ధ సాహితీవేత్తల సమక్షంలో ఈ పురస్కారాన్ని హరికిషన్‌కు అందజేయనున్నారు. పురస్కారం కింద రూ.20,116తో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేయనున్నారు.

ఒకేషనల్ కళాశాలలో స్వచ్ఛాంధ్ర

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బి.క్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోటళ్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం కార్మిక శాఖ ఉపకమిషనర్ కే.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. హోటల్ ఎలైట్ రివేరాలో 15 మంది కార్మికులకు 6 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రామాంజనేయులు, కోశాధికారి రంగనాయకులు, ఒడిస్సా, బెంగాల్, జార్ఖండ్, అస్సాం కార్మికులు ఉన్నారు.

'మాంటే' విద్యార్థుల ప్రతిభ

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో మాంటే పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు వైస్‌ప్రిన్సిపాల్ తెలిపారు. తమ విద్యార్థులు సోమ్లాజా శంకా ఆర్య, ఇషితా రింక్, రోడ్ రేసులో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. శనివారం కోఆర్డినేటర్ తబస్సుం విద్యార్థులను అభినందించారు. వీరు నవంబరు 1న కాకినాడ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. స్కేటింగ్ సంఘం సీఈవో సునీల్ కుమార్ ఉన్నారు.

తైక్వాండో, కరాటేతో ఆత్మవిశ్వాసం



విద్యార్థులతో మంత్రి టీజీ భరత్

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో, కరాటే సాధన చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు కలర్ బెల్టులు ప్రదానం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలు క్రీడల్లో పాల్గొనేలా చూడాలన్నారు. కర్నూలులో ఏర్పాటుకానున్న పారిశ్రామిక వాడలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. కార్పొరేటర్ పద్మలతారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, టి.నరసింహ, నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, డా.ఇందు ప్రకాష్ ఉన్నారు.

అక్రమంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు

- కలెక్టర్ డా.సిరి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లైసెన్సు లేకుండా, అక్రమంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ డా.ఏ.సిరి హెచ్చరించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లకు సూచనలు చేశారు. ప్రజలు బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా చిన్న పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి


ఎంపీ నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు. ఆర్ఐవో లాలెప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యంతో ఆరోగ్యంపై ప్రభావం

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాయు కాలుష్యం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా 19వ వార్డు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ పార్క్‌లో ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాని పిలుపునిచ్చారు పరిసరాలను కాపాడుకోవడం బాధ్యతగా బావించాలని సూచించారు. పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

వాహన కొనుగోలుదారులకు ఊరట

జీఎస్టీ తగ్గింపుతో వాహనాల కొనుగోలుదారులకు ఊరట లభించిందని ఎమ్మెల్యే, జడ్పీ సీఈవో నారసనరెడ్డి అన్నారు. శనివారం సి.క్యాంప్ సమీపంలోని శౌర్యా హోండా షోరూంలో ఎమ్మెల్యే వినియోగదారులకు అవగాహన కల్పించారు.

గౌరు దంపతులకు ముస్లింల సన్మానం

బస్తిపాడు గ్రామ ముస్లింలు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి దంపతులను శనివారం ఉలిందకొండ సింగిల్ విండో డైరెక్టర్ బోయ నాగరాజు, సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిని కలిశారు. బస్తిపాడులో శాధిఖాన నిర్మాణానికి, శ్మశాన వాటికకు కంపౌండ్‌వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలనివినతిపత్రం అందజేశారు. తడకనపల్లె సర్పంచ్ సహరాబీ, బందే మహబుబ్ బాషా పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను అడ్డుకోవడం సరికాదు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్నఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరి మండలం చిట్యాల గ్రామంలోకి రాకుండా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవిని అడ్డుకోవడం సరికాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణకు గ్రామానికి వెళ్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని స్థానిక ఎమ్మెల్యే తెలుసు కోవాలన్నారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలిసి గ్రామాలలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని విన్నవించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మేయర్ బీవై.రామయ్య, చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, తెర్నేకల్ సురేంద్రరెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో రైతుకు ప్రయోజనం

- మోదీ, చంద్రబాబు ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు
- కర్నూలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలతో రైతులకు ప్రయోజనం చేకూరుతోందని ఇక ప్రధాని మోదీ సీఎం చంద్రబాబు ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని కర్నూలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి పేర్కొన్నారు. శనివారం కర్నూలు మార్కెట్ యార్డులో విలేకరులతో మాట్లాడుతూ కర్నూలులో నిర్వహించిన జీఎస్టీ సభకు లక్షలాదిగా ప్రజలు, రైతులు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి తరలివచ్చారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలమైందన్నారు. ఉల్లి రైతులు గిట్టుబాటు ధర లేక నష్టపోతే క్వింటం ఉల్లికి రూ.1,200లు మార్క్‌ఫెడ్ ద్వారా ఇచ్చామన్నారు. అలాగే హెక్టారు ఉల్లికి రూ.50వేలు ఇచ్చేందుకు సీఎం నిర్ణయం తీసుకున్నా రన్నారు. ఉమ్మడి జిల్లాలో సాగవుతున్న పత్తికి ప్రధాని మోదీ క్వింటానికి రూ.1,110లు మద్దతు ధర అందించేందుకు నిర్ణయం తీసుకున్నారని, వారం రోజుల్లో ప్రారంభించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.13వేలు మాత్రమే ఇవ్వగా టీడీపీ ఏకంగా రూ.20వేలు ఇచ్చిందన్నారు.

దీపావళి వేడుకలు


విద్యార్థులతో కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేవీఆర్ గార్డెన్ కేవీఆర్ పాఠశాలలో దీపావళి వేడుకలు శనివారం నిర్వహించారు. కరస్పాండెంట్ ప్రిన్సిపల్ సాధు శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి పాల్గొని అమ్మవారి విగ్రహానికి పూజలు చేసి సుఖసంతోసాలతో ఆరోగ్యంగా ఉండాలని, విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని అమ్మవారిని కోరారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

కాలుష్యం తగ్గించేందుకు సైకిల్ వాడాలి


సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని తగ్గించేందుకు అందరూ సైకిల్ వాడాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి రాజవిహర్ వరకు సిబ్బంది, విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజ్‌విహార్ సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేయించారు. అలాగే కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలతో కలిసి కమిషనర్ ప్రతిజ్ఞ చేశారు. నగరంలో వాయు కాలుష్యం పెరిగిందని ప్రతిఒక్కరూ సైకిల్ తొక్కడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. మేనేజర్ చిన్నరాముడు, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, డీసీపీ వెంకటరమణ, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, సీఎంఎం భాస్కర్‌రెడ్డి, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

● జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించాలని, సైకిల్ తొక్కాలన్నారు.

వాలీబాల్ విజేత తాండ్రపాడు జట్టు


ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ కళశాల ఆవరణలో నిర్వహించిన రాజావర్ధన్ రెడ్డి స్మారక వాలీబాల్ పోటీల్లో తండ్రపాడు జట్టు విజేతగా నలిచింది. రెండో స్థానంలో టీజీవీ స్పోర్ట్స్ క్లబ్, తృతీయ స్థానంలో బనగానపల్లె జట్టు నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. యువ నాయకుడు గౌతమ్‌రెడ్డి బహుమ తులను అందజేశారు. పోటీలు విజయవంతం కావడానికి సహకరించిన క్రీడాకారులకు, సిల్వర్‌జూబ్లీ యాజమాన్యానికి వాలీబాల్ శిక్షకులు రవితేజ, రాజేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, గురువయ్య, వజియ్, బీ.క్యాంపు ఇన్‌చార్జి రాజలయ్య, రమేష్, శ్రీను, నాని, అఖిల్, కళ్యాణ్, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


ఓర్వకల్లు బస్టాండులో మానవహారం

ఓర్వకల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం వస్తుందని టీడీపీ కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఓర్వకల్లు, హుశేనాపురం, గుట్టపాడు, కాల్వబుగ్గ, నన్నూరు గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర నిర్వహించారు. ఓర్వకల్లులో లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, అధికారులు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు. కాల్వబుగ్గలో ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో చైర్మన్ కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించారు.

74 ఏళ్ల మహిళకు అరుదైన శస్త్ర చికిత్స



రోగితో వైద్యుడు డా.షేక్ మన్నన్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన 74 ఏళ్ల సాలమ్మకు కర్నూలు కిమ్స్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. శనివారం స్పైన్ సర్జన్ డా.షేక్ మన్నన్ రోగితో కలిసి వివరాలు వెల్లడించారు. సాలమ్మ నడుం నొప్పితో మంచానికి పరిమితమైంది. ఈ నెల 2న కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు వచ్చింది. ఎంఆర్ఐ పరీక్ష చేయగా.. వెన్నముకలోని డీ11, డీ12 భాగం వద్ద కంప్రెషన్ ఫ్రాక్చర్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 3న 19 స్క్రూలను ఉపయోగించి ఆరు గంటలు శ్రమించి క్లిష్టమైన ఆనపరేషన్ చేసి వంగిపోయిన వెన్నముకను సరిచేసి మళ్లీ సాధారణ స్థితికి తెచ్చారు. శస్త్ర చికిత్సలో పూర్తిగా టైటానియం, డ్యూయల్ త్రేడెడ్ స్క్రూలను ఉపయోగించామని, వీటితో ఇన్‌ఫెక్షన్ ఉందని డా.షేక్ మన్నన్ తెలిపారు. రోగి కోలుకోవడంతో ఈ నెల 9వ తేదీన డిశ్చార్జ్ చేశామన్నారు.

శివరాముడికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న శివరాముడికి డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి లభించింది. ఈయన స్వస్థలం ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం చిన్న కంబలూరు గ్రామం. మహానందిలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసిన అనంతరం 2005 గ్రూప్-2కు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో బేతంచెర్ల, రుద్రవరం, కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు రూరల్, ఆదోని, గూడూరు, జూపాడుబంగ్లా తహసీల్దార్‌గా పని చేశారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా


వివరాలు తెలుసుకుంటున్న నీరజ

కర్నూలు కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకం కింద సోలార్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్తును ఆదా చేసుకోవచ్చని జీఎస్టీ జాయింట్ కమిషనర్ నీరజ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సూర్యఘర్ పథకంపై కీర్తి సోలార్ సంస్థ ఎండీ జనార్ధనరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కీర్తి సోలార్ ఎండీ జనార్ధనరెడ్డి మాట్లాడుతూ 3 కేవీ ప్యానల్‌పై రూ.11 వేల జీఎస్టీ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నెడ్‌క్యాప్ అధికారి వీరేంద్ర, ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈ నాగప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా ప్రగతికి పోరాడుదాం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చరిత్ర ఉన్నా వెనుకబాగుకు గురవుతున్న జిల్లా ప్రగతికి ఐక్యమత్యంతో పోరాడుదామని కర్నూలు ప్రగతి సమితి అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష పిలుపునిచ్చారు. శనివారం బిర్లా కాంపౌండులోని కార్యాలయంలో 'కర్నూలుకు తాగు నీరు-రైతులకు సాగునీరు' నినాదంతో గుండ్రేవుల ప్రాజెక్టు ఆవశ్యకతపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. చెన్నయ్య, మన్సూర్, నౌషద్, విద్యావేత్త జి.పుల్లయ్య, రామక్రిష్టారెడ్డి ఉన్నారు.

వైద్య కళాశాలలపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కల్లూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్య కళాశాలలపై ప్రశ్నించే హక్కు వైసీపీకి లేదని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కెఎస్.శ్రీనివాసరావు అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ఆదేశాల మేరకు శరీన్‌నగర్‌లోని కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జులు పియూ.మాదన్న, జనార్ధన్ ఆచారి, ఎస్వీ.రామకృష్ణతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పీపీపీ పద్ధతితో కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పీపీపీ అంటే తెలియని వైసీపీ విష ప్రచారం చేస్తూ, కోటి సంతకాల సేకరణ పేరుతో ప్రజలు మభ్య పెడుతోందని ఆరోపించారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి తీసుకురావడానికి సీఎం చంద్రబాబు అహర్నిషలూ కృషి చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మెడికల్ కళాశాలల నిర్వహణపై జీవో నెం. 108 విడుదల చేసిందని, అందులో 15శాతం సెంట్రల్‌పూల్ కోటా మినహా 85శాతంలో సగం కన్వీనర్ కోటా మిగిలిన సగం యాజమాన్య కోటా, ఎన్ఆర్ఐ కోటా కింద సీట్లు భర్తీ చేసేలా ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. యాజమాన్య కోటాలో రూ.12లక్షలు, ఎన్ఆర్ఐ కోటాలో రూ.20 లక్షలు దండుకునేలా చేసింది వైసీపీ కాదా అని ప్రశ్నించారు. ఈ లెక్కన పేద విద్యార్థులు కోర్సు పూర్తి చేసేందుకు రూ.కోటి అవుతుందన్నారు. శైలజాయాదవ్, ఫిరోజ్, గంగాధర్ గౌడ్, రామచేంద్ర, పుల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

తుంగభద్రమ్మ.. ఏమిటీ దుస్థితి



భారతదేశంలో నదిని తల్లిగా భావిస్తారు. నదీమతల్లిని పూజిస్తారు. అలాంటి నదీజలాలు కలుషితమవుతున్నాయి. దీనికి కారణం ఎవరు? ప్రజలా? పాలకులా? ప్రజల నిర్లక్ష్యం.. అధికారు అలసత్వం.. వెరసి స్వచ్ఛమైన జలాలతో ప్రవాహించాల్సి నది కలుషితమై.. దుర్గంధ భరితంగా మారింది. దక్షిణ భారతదేశంలో రెండవ తిరుపతిగా పేరు గాంచిన మంత్రాలయం వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నది కలుషితమవుతుంది. గ్రామం నుంచి వచ్చిన మురుగంతా యథేచ్ఛగా నదిలో కలుపుతున్నారు. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు సైతం భరించలేని దుర్వాసనతో పుణ్యస్నానాలు చేసేందుకు అల్లాడిపోతున్నారు. గణేశ్ ఘాట్ వద్ద కాలువల ద్వారా మురుగు నదిలోకి వదిలి కలుషితం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుంగభద్రలో మురుగునీరు కలవకుండా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.

● మంత్రాలయం, ఆంధ్రజ్యోతి

మనోహరం.. ఉల్లి తోరణం



మనిషి దేనినైనా సద్వినియోగం చేయగలడు అనేందుకు నిలువెత్తు నిదర్శనమే ఈ చిత్రం. ఇందులో కనిపిస్తున్నది తాడు వేలాడుతున్న ఉల్లిగడ్డలే అయినా ఈ ఉల్లిగడ్డలనే ఇంటికి తోరణంలా అలంకరించాడు ఓ రైతు. ఈ యేడు ఉల్లి అన్నదాతలకు కన్నీళ్లు పెట్టించింది. చాలామంది కర్షకులు పొలాల్లోనే ఉల్లి పంటను వదిలేశారు. ఈరైతు మాత్రం అందరిలా కాకుండా భిన్నం ఆలోచించాడు. ఓతాడు తీసుకొని ఉల్లిగడ్డలను ఒక్కొక్కటిగా జత చేసి తోరణంలా మార్చాడు. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన ఉల్లి రైతు హనుమయ్యగారి మునిస్వామి. ఉల్లి విత్తనాల కోసం మంచి ఉల్లిగడ్డలను ఒక్కొక్కటిగా జతచేసి తన ఇంటి ఆవరణలో తోరణంగా అలంకరించాడు. అటుగా వెళ్లేవారికి ఇది ఎంతగానో ఆకట్టుకుంటోంది. రైతు తెలివిని ప్రజలు మెచ్చుకుంటున్నారు.

● కోసిగి, ఆంధ్రజ్యోతి

దక్షిణాసియాలోనే ఏఐ హబ్‌గా వైజాగ్

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వినూషారెడ్డి



కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణాసియాలోనే విశాఖపట్నం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా నిలుస్తుందని ఏపీ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.వినూషారెడ్డి అన్నారు. నగరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం తీసుకున్న దూరదృష్టి నిర్ణయాలతో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం దేశంలోనే ప్రప్రథమ ఆర్టిఫిషియల్ నగరంగా రూపాంతరం చెందబోతుందన్నారు. ఇండియా ఆర్టిఫిషియల్ మిషన్‌ను 2024 మార్చిలో రూ.10,371 కోట్లతో ప్రారంభించిన కేంద్రం 2025 సెప్టెంబరులో నిధులను రూ.20వేల కోట్లకు పెంచిందన్నారు. ప్రధాని మోదీ చెప్పినట్లుగా భారతదేశం ఆర్టిఫిషియల్ వినియోగదారుల నుంచి సృష్టికర్తలుగా మారాలని తెలిపారు. ఆల్ఫాబెట్ ఇంక్ (గూగుల్ పేరెంట్ కంపెనీ) భారత్‌లో యూఎస్ఏ బయట అతిపెద్ద ఆర్టిఫిషియల్ డేటా సెంటర్‌ను విశాఖలో నెలకొల్పనుందన్నారు. రూ.1.3 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టులో 1జీడబ్ల్యూ కంప్యూటర్ సెంటర్, 12 దేశాలను కలిపే అండర్ డిజిటల్ కేబుల్ నెట్‌వర్క్ ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, ఏపీ ఐటీ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ప్రకటించారన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అతిపెద్ద ఎఫ్‌డీఐ పెట్టుబడి - కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం చేసిన సంవత్సర కాలం కృషికి ఫలితం అని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.1.8 లక్షల, పరోక్ష ఉద్యోగాలు వస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు వస్తున్నాయని, అసూయతో పారాసైట్, స్కావెంజర్ వంటి పదజాలంతో దూషించడం తగదని అన్నారు. వైజాగ్‌లో గూగుల్ పెట్టుబడిపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. మీ పాలనలో ఎన్ని పెట్టుబడులు తీసుకువచ్చారో చెప్పాలన్నారు.

26న రాష్ట్ర స్థాయి డ్రాగన్ బోటు క్రీడాకారుల ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీన గార్గేయపురం సిటీ ఫారెస్ట్ చెరువు వద్ద రాష్ట్ర స్థాయి డ్రాగన్ బోటు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సంఘం కార్యదర్శి మంచికంటి అవినాశ్ శెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలు స్త్రీ, పురుషులకు అండర్-23 పార విభాగంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు 26వ తేదీన ఉదయం 7 గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డ్రాగన్ బోట్ ఇండియా అండ్ ట్రెడిషినల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 24 నుంచి 27 వరకు మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్‌లో జరిగే 12వ జాతీయ స్థాయి డ్రాగన్ బోట్ పోటీల్లో ఏపీ జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు రూ.100 ప్రవేశ రుసుంతో నేరుగా హాజరు కావాలని తెలిపారు. వివరాల కోసం 8143084479ను సంప్రదించాలన్నారు.

కోర్టు ఆదేశాల మేరకు వ్యక్తి అరెస్టు

గూడూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో విచారణకు హాజరు కాకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు చనుగొండ్ల గ్రామానికి చిన్న మద్దిలేటిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. వివరాల మేరకు.. అదే గ్రామానికి చెందిన మల్లేశ్వరమ్మ నిందితుడిపై ఫిర్యాదు చేశారు. గూడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారి ఇచ్చిన నోటీసు ఇచ్చినా, నిందితుడు విచారణకు హాజరు కాలేదు. దీంతో నిదితుడిని అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు న్యాయస్థానాన్ని కోరగా, న్యాయయాధికారి ఆదేశం ఇచ్చారు. దీంతో నిందితున్ని ఆరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల స్వీకరణ

నంద్యాల టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు ఈనెల 25నుంచి వచ్చే నెల 8వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మెషీనిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మన్, సివిల్ విభాగాల్లో అప్రెంటిస్‌షిప్‌కు అవకాశం ఉందని తెలిపారు. ఆ జిల్లాల్లో ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. అప్రెంటిస్‌షిప్ ఇండియా. గవర్నమెంట్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 43 ఖాళీలు ఉన్నాయని, పూర్తి సమాచారం కోసం 08518-257025 నెంబరును సంప్రదించాలని సూచించారు.

సుమతీంద్ర తీర్థులకు బంగారు రథం



నూతనంగా తయారు చేయించిన బంగారు రథం ముందు పీఠాధిపతులు

మంత్రాలయం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుమతీంద్ర తీర్థులకు కొత్త బంగారు రథాన్ని తయారు చేయించారు. తమిళనాడులోని శ్రీరంగం మఠానికి నంజనగూడ రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు దాదాపు 4 కేజీల బంగారంతో తయారు చేయించిన రథాన్ని శనివారం ఇచ్చారు. దీంతో ఆయా మఠాధిపతులు రథానికి పూజలు చేసి ప్రారంభించారు. రథంపై సుమతీంద్ర తీర్థుల బృందావన ప్రతిమను అధిష్ఠించి ఊరేగించారు.

సంప్రదాయాలు ఉట్టిపడేలా కర్నూలు ఉత్సవ్

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా 'కర్నూలు ఉత్సవ్'ను నవంబరు ఒకటి నుంచి ఏడో తేదీవరకు వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య అన్నారు. శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కళాక్షేత్రం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ విజయవాడ తర్వాత ఆ స్థాయిలో కర్నూలు ఉత్సవ్‌ను జయప్రదం చేసేందకు కళాకారులు సహకరించాలని కోరారు. ఈ ఉత్సవ్‌లో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులను అతిథులుగా ఆహ్వానిస్తున్నామని, అదేవిధంగా జిల్లా ఉన్నతాధికారులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని తీర్మానించామని తెలిపారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ నాటక అకాడమీ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ నాటకం, సాహిత్యం, సంగీతం, హార్మోనిస్టులు, నేపథ్య గాయకులు ప్రతి రోజూ వారి సేవలను గుర్తు చేస్తూ పది మందిని సత్కరిస్తామన్నారు. ఎంపిక ప్రక్రియను గజల్ గాయకుడు మహమ్మద్ మియా, ఎర్రమ పాండురంగయ్య, ఇనాయతుల్లా, గాండ్ల లక్ష్మన్న, జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు పర్యవేక్షిస్తారన్నారు. ఏపీ అవతరణ సందర్భంగా ఒకటో తేదీన కలెక్టర్ కార్యాలయం నుంచీ టీజీవీ కళాక్షేత్రం వరకు నగర ప్రముఖులు, కళాకారులు, సాహిత్యవేత్తలతో కలిపి వెయ్యి మందితో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కర్నూలు ఉత్సవ్‌కు రాష్ట్ర సాంస్కృతిక శాఖ కొంత మేరకు ఆర్థిక సహాయం అందిస్తుందని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో కళాక్షేత్రం ప్రతినిధులు సి.యాగంటీశ్వరప్ప, పి.రాజారత్నం, కేవీ రమణ, పీపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీజీవీ కళాక్షేత్రంలో హరికథ ప్రదర్శన

నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి 7 గంటలకు వారం వారం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా టీటీడీ దేవస్థానం హరికథా భాగవతారిణి లక్ష్మీ మహేష్‌చే 'శ్రీకృష్ణ రాయబారం హరికథ' ప్రదర్శన ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు.

జగన్ మెప్పు కోసం విరూపాక్షి ఆరాటం

● ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

● ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



ఆలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ మెప్పు కోసం ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఆరాట పడుతున్నారని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కర్నూలు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీని కలిసి వాల్మీకుల సమస్యలు, మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై వివరిస్తూ వినతి పత్రం ఇచ్చానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధానికి ఎమ్మెల్యే ఏ భాషలో సమస్యలను వివరించారో చెప్పాలని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు తెలుగు తప్ప హిందీ, ఇంగ్లీష్ భాషలు రావన్నారు. మీడియాలో ఉనికి కోసం ఇలా ఫేక్ ప్రచారాలు చేసుకోవడం తగదన్నారు. అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై మరోసారి విమర్శలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. టీడీపీ నాయకులు కురువ జయరాం, సాలీసా హెబ్, వీరనాగప్ప, కిషోర్ పాల్గొన్నారు.

బాధితులకు బంగారం అప్పగింత

నంద్యాల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదు అందిన గంటన్నర వ్యవధిలోనే ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను కనిపెట్టి 9 తులాల బంగారాన్ని బాధితునికి అప్పగించినట్లు నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం సీఐ తెలిపిన వివరాలివీ.. నంద్యాల నడిగడ్డకు చెందిన షేక్ రెహమాన్ ఈ నెల 17వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి కోయిలకుంట్ల వెళ్లడానికి నడిగడ్డలో ఆటో ఎక్కి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లారు. అయితే ఆటోలో ఆయన భార్య హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయి అలాగే ఆటో దిగి వెళ్లారు. ఆ బ్యాగ్‌లో దాదాపు 9 తులాల బంగారం ఆభరణాలు ఉన్నట్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే స్థానిక పోలీసులు ఉన్నతాధికారులకు తెలియజేసి, తమతో పాటు క్రైం టీమ్ సభ్యులు కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లోని సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆటోను గుర్తించి, ఆటోలోని బంగారు నగల బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని ఫిర్యాదుదారుడికి అప్పగించినట్లు తెలిపారు. ఈ ఘటనలో వెంటనే స్పందించి ఆటోను ట్రేస్ చేయడంలో కృషి చేసిన హెడ్ కానిస్టేబుళ్లు రమణ, సుబ్బయ్య, కానిస్టేబుల్స్ అమీర్, గురుశేఖర్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని రామచంద్ర నగర్‌కు చెందిన బంగి రామాంజనేయులు (43) ఆత్మహత్య చేసుకున్నాడు. మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివీ.. రామాంజనేయులు ఏడాది నుంచి భార్యపిల్లలకు దూరంగా ఉంటూ బేల్దారు కూలీగా పని చేసేవాడు. మానసికస్థితి బాగలేకపోవడంతో మనస్తాపానికి గురై అభయ ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న తన పొలంలోని రేకుల షెడ్డులో శుక్రవారం తన పంచాతో ఉరివేసున్నాడు. శనివారం పొలంలో వాసన రావడంతో గమనించి పని మనుషులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని కిందికి దించి పరిశీలించారు. రామాంజనేయులు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రధాని పర్యటన విజయవంతం: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైందని కలెక్టర్ ఏ.సిరి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులందరూ కష్టపడి పనిచేశారని, వారందరిని ఆమె అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు బాగా చేశారని సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అభినందిం చారని తెలిపారు.

జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు..

9 నెలల్లో 6,858 డ్రంకెన్ డ్రైవ్, 13,555 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు

కర్నూలు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పోలీసులు శనివారం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సమాచారం మేరకు.. 9 నెలల్లో మొత్తం 6,858 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 13,555 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదయ్యాయి. పోలీస్ స్టేషన్‌లలో మైనర్లకు, మందుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చేశారు. పిల్లలకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించారు.

వైద్యుల సమ్మెతో జీతాల సమస్య

సీహెచ్‌వోలకు డ్రాయింగ్ పవర్స్ ఇవ్వాలి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉండటంతో ఉద్యోగులకు జీతాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశముందని తెలుగు నాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మాట్లాడుతూ ప్రతి నెల 20వ తేదీనాటికి జీతాల బిల్లులను ట్రెజరీకి పంపాలని అప్పుడే 1వ తేదీకి జీతాలు జమ అవుతాయన్నారు. ప్రభుత్వం స్పందించి డ్రాయింగ్ పవర్స్‌ను సీహెచ్‌వోలకు బదలాయించాలని కోరారు. ఈమేరకు వైద్యఆరోగ్య శాఖ మంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీకి మెయిల్ పంపామన్నారు.

సురక్షితమైన వైద్యం కోసమే స్కిల్ ల్యాబ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రోగులకు సురక్షితమైన వైద్యాన్ని అందించడానికి స్కిల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ అన్నారు. శనివారం మోర్టన్ సెమినార్ హాలు, స్కిల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ల్యాబ్ వల్ల వైద్య విద్యార్థులు వైద్యసేవలో నైపుణ్యాలను సాధన చేసుకోవచ్చన్నారు. మోర్టన్ సెమినార్ హాలు, స్కిల్ ల్యాబ్ నిర్మాణానికి కేఎంసీ 1985 బ్యాచ్ విద్యార్థులు డా.అడ్రుస్ జేసుదాస్, డా.ఎస్. చంద్రశేఖర్‌తో పాటు వైద్యలను ప్రిన్సిపాల్ అభినందించారు. అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీరాములు, వైస్ ప్రిన్సిపాల్ డా.విజయానంద బాబు, డా.రేణుకాదేవి, ప్రొఫెసర్లు డా.సుధీర్, డా.రామశివనాయక్, సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, పీజీలు వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.



స్కిల్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టి నర్సమ్మ, వైద్యులు

30 క్వింటాళ్ల పత్తి చోరీ



ఘటనా స్థలం వద్ద విచారిస్తున్న పోలీసులు

గోనెగండ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కున్నూరు గ్రామంలో ఓ పొలంలో శనివారం తెల్లవారుజామున పత్తి చోరీ జరిగింది. వివరాలివీ.. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రమణ చౌదరి 23 ఎకరాలలో పత్తి సాగు చేశారు. పొలంలోనే షెడ్డు ఏర్పాటు చేసి దిగుబడిని అందులోనే నిల్వ ఉంచారు. ప్రస్తుతం ప్రభుత్వం పత్తిపంటకు మంచి ధర ప్రకటించడంతో నిలువ చేసి ఒకేసారి విక్రయించాలని భావించి ప్రతి రోజు తీసిన పత్తిని షెడ్డులోనే నిల్వ చేశారు. మొదట్లో కేవలం 20 క్వింటాళ్ల పత్తిని మాత్రమే విక్రయించారు. షెడ్డులో దాదాపు 60 క్వింటాళ్ల వరకు పత్తిని నిల్వ చేశారు. వంద బస్తాల పత్తిని వాహనంలో శనివారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లారు. రమణ చౌదరి ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారిస్తున్నారు.

దేవాలయానికి ఎమ్మెల్సీ ఆర్థిక సాయం

ఆదోని రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం గణేకల్లులో నిర్మిస్తున్న బంగారమ్మవ్వ దేవాలయానికి వైసీపీ ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఆర్థిక సాయం అందజేశారు. గణేకల్లు గ్రామస్థులు శనివారం ఆయనను కలిసి గ్రామంలో దేవాలయం నిర్మిస్తున్నామని తెలపడంతో ఆయన రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నారు.

'సోలార్‌తో విద్యుత్ ఆదా'

ఆలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఆదా అవుతుందని విద్యుత్‌శాఖ ఏఈ గురప్ప తెలిపారు. సోలార్ వ్యవస్థ అమర్చితే నెలకు 100 యూనిట్ల వరకు విద్యుత్ ఆదా ఉంటుందన్నారు. కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ పంపాస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై దాడి చేయడం సిగ్గు చేటు

పత్తికొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమానికి చిట్యాల గ్రామానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి కాన్వాయ్‌పై దాడికి పాల్పడడం అమానుషమని వైఎస్సార్సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం అధికార ప్రతినిధి రంగడు, ఎంపీపీ నారాయణదాసు, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు సోమశేఖర్‌లు అన్నారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు భాస్కర్‌నాయక్, నాయకులు బనగాని శ్రీనివాసులు, నాయకులు నాగరాజు, నరసింహ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర:పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిపై దాడి చేయడం సిగ్గు చేటని మండల వైసీపీ అధ్యక్షులు టి.మల్లికార్జున యాదవ్, మండల వైసీపీ ఉపాధ్యక్షులు కృష్ణా యాదవ్ అన్నారు. జడ్పీటీసీ సభ్యులు డి.మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ బండారు సుహాసిని, ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, మాజీ సర్పంచులు వై.శాంతన్న, వెంకటేశ్వర్లు, కన్నప్ప తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి టౌన్: వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎన్.నగరం దేశాయ్ సమీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పార్టీ అధిష్టానంఆదేశాలతో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాడేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తు క్రిష్ణగిరి మండలం చిట్యాలకు వెళ్తుండగా... గ్రామ టీడీపీ నాయకులు అడ్డుకుని దాడులు చేయడం, హేయమైన చర్య అన్నారు. కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, శరభారెడ్డి, రామళ్లకోట రాధాకృష్ణారెడ్డి, శ్రీరాంరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, పేరేముల సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

దాత ఔదార్యం..

తుగ్గలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి చెందిన రాజు తన సొంత డబ్బులతో జొన్నగిరి ఎస్సీ కాలనీలో వీధి బల్బులు వేయించారు. శనివారం మండల పరిధిలోని జొన్నగిరి ఎస్సీ కాలనీలో వీధి బల్బులు లేక చీకటిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి వెళ్లడంతో ఎస్సీ కాలనీలోని ఎలక్ట్రిషన్‌తో వీధి బల్బులు వేయించారు. కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

హాస్టల్ ఏర్పాటుకు పరిశీలన

తుగ్గలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతమైన తుగ్గలి మండలంలో బాలుర సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలని మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ బత్తిన వెంకట్రాముడు, మాజీ జిల్లా కో-ఆప్షన్ మెంబర్ నబీ రసూల్ అధికారులతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో రామలింగాయపల్లెలో హాస్టల్ ఏర్పాటుకు జిల్లా అధికారి మాధన్న పాఠశాలను శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సంక్షేమ శాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లడంతో హాస్టల్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే హాస్టల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు ఖాజాబేగ్ ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఆదోని టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ను శనివారం ఆదోని పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో జిల్లా కార్యదర్శి హుస్సేనప్ప యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు యువరాజ్, దీపక్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. శనివారం మొలగవల్లిలో గ్రామంలో ఆదర్శ పాఠశాలలో నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మోహన్‌రాజ్, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కటారు కొండ శ్రీనివాసులు, మండల కో కన్వీనర్ అశోక్‌యాదవ్, రహమాన్, ఎంఈఓలు కోమలాదేవి, చిరంజీవిరెడ్డి, మాజీ సర్పంచ్ రంగస్వామి, కమ్మ రామాంజినేయులు, ప్రవీణ్‌కుమార్, బెలగంటి హనుమప్ప, డీలర్ వెంకటేశ్వర్లు, అంజనేయ, కొట్టాల సర్పంచు రాజశేఖర్, మోకా మల్లయ్య, షేక్షావలి, ప్రసాద్, బేవిన ఈరన్న, అఖిల్‌యాదవ్, ఉసేని, నరసింహులు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు : తహసీల్దార్

ఆదోని రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రమేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాణాలను విక్రయించాలని, అధిక రేట్లకు విక్రయించరాదని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన బాణాల విక్రయ కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు.

ఆలూరు: దీపావళి పండగ సందర్భంగా లైసెన్స్ ఉన్న వ్యాపారులు మాత్రమే బాణసంచా విక్రయించాలని తహసీల్దార్ శోభా సువర్ణమ్మ శనివారం తెలిపారు. ప్రజలు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు పేల్చకూడదన్నారు. లైసెన్సు లేకుండా టపాసులు విక్రయిస్తే జీవో నంబర్ 84, పెట్రోలియం రూల్స్ 2008 ప్రకారం వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతామన్నారు.

స్వచ్ఛతపై ర్యాలీ

ఆదోని టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన ర్యాలీని శనివారం మునిసిపల్ కమిషనర్ కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. పరిసరాల కార్యక్రమాలను ప్రతి వార్డులో ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మొక్కలు నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్త్ ఆఫీసర్ డా. సందీప్ కుమార్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా సుదర్శనం బాధ్యతల స్వీకరణ



సుదర్శనంను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

దేవనకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ తహసీల్దార్‌గా యం.సుదర్శనం శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేస్తున్న రామాంజినేయులు ఆటవీ భూముల వ్యవహారంలో సస్పెండ్ కావడంతో, ఆయన స్థానంలో తుగ్గలిలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించే సుదర్శనంకు జిల్లా తహసీల్దార్ (ఫుల్ అడిషనల్ చార్జ్)గా బాధ్యతలు ఇచ్చారు. విధులు చేపట్టిన సుదర్శనంకు కార్యాలయంలో రీసర్వే డీటీ అమీనాబీ, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, వీఆర్వోలు రాజన్న, సుంకన్న, సూరీడు, తదితరులు సన్మానించారు.

నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి

మద్దికెర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని నాయీ బ్రాహ్మణ సేవా సేవా సంఘం నాయకులు మంగళి వీరేంద్ర, ఆరోగ్య వైద్యులు కానుగుల రామాంజనేయులు అన్నారు. శేఖర్, నాగభూషణం, సోమశేఖర్, వీరేంద్ర, ఎర్రిస్వామి, ఓబులేసు ఉన్నారు.

చంద్రబాబు పాలనలోనే ఉద్యోగులకు న్యాయం

దేవనకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలోనే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, పంచాయతి కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, శివశంకర్‌సింగ్ అన్నారు. పంచాయతి కార్యదర్శులకు పదోన్నతులు పెంచి, గ్రేడులు తగ్గించి, పంచాయతి డెవలప్‌మెంట్ అధికారులుగా గుర్తించడంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పంచాయతి కార్యదర్శులు పాలాభిషేకం చేశారు. పంచాయతి కార్యదర్శులు రవీ, నాగార్జున, నబిరసూల్, లక్ష్మన్న, ఉశేన్, ముని, జూనియర్ అసిస్టెంట్ హరికిరణ్ పాల్గొన్నారు.

హత్య చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కండకూరు గ్రామంలో కాపు బలిజ యువకుడు తిరుమల శెట్టి లక్ష్మీనాయుడిని హత్య చేసిన నిందితులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆదోని బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి వసుంధరను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది లోకేష్ కుమార్, బండి బసవరాజు, రాధాకృష్ణ, సిద్దప్ప, రాజశేఖర్, రేణువర్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదోని: నెల్లూరు జిల్లా కందుకూరులో కాపు బలిజ యువకుడు తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు దారుణ హత్యోదంతంపై ఆదోని బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్, న్యాయవాది లోకేష్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి బసవరాజు, మెట్ల రాధాకృష్ణన్, హాల్వి సిద్ధప్ప, నెల్లిబండ రాజశేఖర్, రేణువర్మ, కడిమెట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు దేశానికి వెలుగు

మద్దికెర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలికల చదువు.. దేశానికి వెలుగు లాంటిదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రివేణి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కేవీఆర్ బాలికల పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మోదీ రాకతో ఊహించని అభివృద్ధికి అవకాశం

ఆదోని టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు జిల్లాకు రావడంతో రాయలసీమకు ఊహించనంత అభివృద్ధికి అవకాశం కలిగిందని బీజేపీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు విట్టా రమేష్, జిల్లా మాజీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఆదోని నియోజకవర్గం పార్టీకి కో కన్వీనర్ నాగరాజు గౌడ్ అన్నారు. మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ఆధూరి విజయకృష్ణ, వెల్లాల మధుసూధన్ శర్మ, అంజయ్య కుమార్, రమాకాంత్ పాల్గొన్నారు.

'ఎయిడ్స్ అంటువ్యాధి కాదు'

మద్దికెర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కమలారావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఎయిడ్స్ పై హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అవగాహన కల్పించారు. హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ, ఓఆర్‌డబ్ల్యూ నీలమ్మ, ఈఈ హుశేన్‌బీ ఉన్నారు.

ఆదోని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా అజయ్‌కుమార్ బాధ్యతలు



ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకుంటున్న అజయ్‌కుమార్

ఆదోని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్ ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌గా తోట అజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆయన ఈ నియామకం పొందారు. ఇంతకుముందు తోట అజయ్ కుమార్ హంద్రీ నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ ఎస్ఎస్) యూనిట్-4లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. ఆదోని సబ్‌కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన డివిజన్ పరిధిలోని ప్రధాన అధికారులను, కార్యాలయ సిబ్బందిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడానికి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, సిబ్బంది నూతన ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీసీఐ కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పత్తి కనీస మద్దతు ధరతో ఈనెల 21 నుంచి కొనుగోలు చేస్తామన్న సీసీఐ స్పష్టత ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మార్కెట్ యార్డ్ కార్యాలయం వద్ద పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో రోజురోజుకి పత్తి వేరుశనగ దిగుబడులకు ధరలు పతనమవుతున్నాయిని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వరంగ సంస్థలు సీసీఐ నేటి వరకు రైతుల రిజిస్ట్రేషన్ యాప్ ఓపెన్ కాలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పత్తి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మల్లయ్య, రైతులు ఈరన్న, హనుమంతు పాల్గొన్నారు.

ఏజీపీగా లావణ్య



ఆదోని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తిలో నిబద్ధత, అంకితభావం కలిగిన ఆదోనికి చెందిన సీనియర్ న్యాయవాది లావణ్యకు అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమెను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లావణ్య నియామకంతో ఆదోని ప్రాంత న్యాయవాదులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదోనిలో సుదీర్ఘకాలంగా న్యాయవాదిగా పనిచేస్తూ, అనేక క్లిష్టమైన కేసులను సమర్థవంతంగా వాదించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు లావణ్య. ఆమె వృత్తి నైపుణ్యం, కేసులపై ఆమెకున్న పట్టు, న్యాయం పట్ల ఆమెకున్న చిత్తశుద్ధి ఆమె ఈ ఉన్నత పదవికి ఎంపిక కావడానికి దోహదపడ్డాయి. ప్రభుత్వం తరపున కేసులను వాదించే కీలకమైన ఏజీపీ పదవికి లావణ్యను ఎంపిక చేయడం పట్ల న్యాయవాద వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. . ఆమె రాబోయే రోజుల్లో తన కొత్త బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



ఖైదీల వివరాలను తెలుసుకుంటున్న న్యాయాధికారి సుధ

ఆదోని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఛైర్మన్, రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి పీజీ సుధ శనివారం ఆదోని స్పెషల్ సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న భోజన సదుపాయాలను ఆమె స్వయంగా పరిశీలించి, జైలు పర్యవేక్షణ అధికారిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి సుధ వివరించారు. అలాగే ఖైదీలతో మాట్లాడడానికి వచ్చే వారికి కల్పించిన మాట్లాడే సదుపాయాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించారు. ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే సంబంధిత మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. జైలులోని వంట గదులు, జైలు గదులను కూడా పరిశీలించి సిబ్బందికి సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక కారాగార సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్, జైలు విజిటింగ్ న్యాయవాది ఆనంద్, జైలు అధికారులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'లో సామాజిక తనిఖీ

ఆదోని రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ సామాజిక తనిఖీ స్థానిక ఏపీవో కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. ఈ తనిఖీని పీడీ వెంకటరమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఏడాదికిగాను మండలంలో రూ.20కోట్ల 5లక్షల 56వేల 269లు ఉపాధి పనుల కోసం ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఈ తనిఖీల్లో అధికారులు రూ.1,85,000/-లు రికవరీ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు సామాజిక తనిఖీ జరిగింది. ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే వారి ఖాతాలో జమ చేయాలని, వలసలను నివారించాలని రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, హనుమంతురెడ్డిలు అధికారులను డిమాండ్ చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

తుగ్గలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే.. కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు గిట్టా నగేష్, జడ్పీటీసీ పులికొండ నాయక్, ఐకేపీ చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా కరపత్రాలను విడుదల చేశామన్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు అట్ల గోపాల్ రెడ్డి, నారాయణ నాయక్, చాంద్‌బాషా, రఘు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి 16 మంది బాధితులకు మంజూరైన రూ. 8,53,968ల చెక్కులను శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అందజేశారు. ఆర్అండ్బీ అతిథిగృహంలో బాధితులకు చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ఇప్పటి వరకు 122మంది బాధితులకు రూ. 1.12 కోట్లు ఆర్థికసాయం సీఎం సహాయ నిధినుంచి అందించటం జరిగిందన్నారు. సీఎం సహయ నిధి బాధితులకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో నందవరం నాయకులు దేశాయ్ మాదవరావు, కాశీం వలి, ధర్మాపురం గోపాల్, చిన్న రాముడు, రవి, బచ్చాల రంగన్న, రామ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న దేశాయి మాధవరావు

నందవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని టీడీపి జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు అన్నారు. శనివారం టీడీపీ కార్యకర్త డీలర్ నరసింహులు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. నరసింహులు ధైర్యంగా ఉండాలన్నారు. డాక్టర్తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఈరన్న, వెంకటేశ్వర్లు, రియాజ్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేయిస్తాం

- ●ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ● లెదర్ సొసైటీ తనిఖీ



లెదర్ సొసైటీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): లెదర్ సొసైటీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. పట్టణ శివారులోని కలుగొట్ల రోడ్డులో ఉన్న ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ లెదర్ సొసైటీని ఎమ్మెల్యే శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు రోజుల క్రితం కొంతమంది సొసైటీ షేర్హోల్డర్స్ ఎమ్మెల్యేను కలిసి సొసైటీలో అక్రమాలతో పాటు తమకు అన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే లెదర్ సొసైటీ ఆవరణలో ఉన్న భవనాలను, అందులో ఉన్న లెదర్ను, వివిధరకాల పరికరాలను పరిశీలించారు. సొసైటీ దగ్గరకు వచ్చిన పలువురు షేర్హోల్డర్స్తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని దళితులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో పద్మశ్రీ మాచాని సోమప్ప హయంలో లెదర్ సొసైటీని ఏర్పాటు చేశారన్నారు. తన తండ్రి బీవీ మోహన్ రెడ్డి హయాంలో కూడా సొసైటీలో ఎంతోమంది ఉపాధి పొందారన్నారు. సొసైటీ షేర్హోల్డర్స్ మూడు రోజుల కిత్రం నన్ను కలిసి లెదర్ సొసైటీలో అవినీతి జరుగుతోందని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. తాను ఇక్కడికి వచ్చి పరిస్థితులను చూస్తే చాలా బాధాకరమనిపిస్తోందన్నారు. పేదవారికి, దళితులకు ఉపాధికల్పించాలని ఏర్పాటు చేసిన సొసైటీలో యాజమాన్యం ముసుగులో అవినీతి అక్రమాలకు తెర లేపారన్నారు. స్థానికంగా ఉన్న వృద్దురాలు యాగమ్మ అనే షేర్హోల్డర్ యాజమాన్యం దగ్గరకు వెళ్లగా మీకు సంబందంలేదు అని బయటకు పంపారన్నారు. ఇది చాలా బాధకరమన్నారు. పదిహేనేళ్లకు పైగా పనిచేసిన వారిపట్ల ఇలా వ్యవహరించటం దారుణమన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.పరిశ్రమల శాఖ జీఎంతో మాట్లాడానని, ఇక్కడ జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేయిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు డా మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్, షాలేం, అంబేడ్కర్, సొసైటీ మెంబర్స్ రంగన్న, సామేల్తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా నందన లావణ్య



కోసిగి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన న్యాయవాది హనుమేష్ సతీమణి న్యాయవాది నందన లావణ్య ఆదోని కోర్టులో 15ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. ఇందుకు గానూ ప్రభుత్వం ఆమె సేవలను గుర్తించి ప్రభుత్వ న్యాయవాదిగా, అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్గా పదవి ఇవ్వడం సంతోషంగా ఉందని న్యాయవాది హనుమేష్, అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్ నందన లావణ్య తెలిపారు. కోసిగి మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన తమకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వ తరపున త్వరితగతిన సివిల్ కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని నందన లావణ్య తెలిపారు. ఈమెను ఎంపిక చేయడం పట్ల కందుకూరు గ్రామస్థులు, తోటి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

వైభవంగా సుమతీంద్ర తీర్థుల శతమానోత్సవం



సుమతీంద్ర తీర్థుల బృందావనానికి పూజలు చేస్తున్న ఉభయ పీఠాధిపతులు

మంత్రాలయం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి శిష్యులైన మఠం పూర్వ పీఠాధిపతులు సుమతీంద్ర తీర్థుల 300 ఆరాధన మహోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. తమిళనాడు రాష్ట్రంలోని నంజనగూడ రాఘవేంద్ర స్వామి మఠాన్ని రూ.4కోట్లతో అభివృద్ధి చేస్తామని అందుకు సంబంధించిన నగదును డిపాజిట్ చేసినట్లు పీఠాధిపతి ప్రకటించారు. మంత్రాలయం, సోదే వ్యాసరాజ, సోషలే వ్యాసరాజ, తంబిహళ్లి , శ్రీపాదరాజ, మాధవ తీర్థ మఠం పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థులు, విశ్వవల్లభ తీర్థులు, విద్యాశీర్ష తీర్థులు, మాధవతీర్థులు, సుజయనిధి తీర్థులు,విద్యవల్లభ మాధవ తీర్థులు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఆయా మఠాల పీఠాధిపతులకు మంత్రాలయం పీఠాధిపతి శాలువ, వెండిగిన్నె, నగదు ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్లు శ్రీపతిఆచార్,సురేష్ కోణాపూర్, ఐపీ నరసింహామూర్తి, వాదిరాజాచార్, హరినాథ్ ఆచార్,ద్వారపాలక అనంతస్వామి,ప్రకాష్ ఆచార్ పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



రైతు రాఘవేంద్ర మృతదేహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న రైతు రాఘవేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, వార్డు ఇన్చార్జి పామయ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు లతా రెడ్డి, నాయకులు పాల శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్ రమేష్, నరసింహులు యూత్ నాయకులు బోయ రాజు కోరారు. శనివారం స్థానిక వైసీపీ ఇన్చార్జీ బుట్టు రేణుక, బుట్టా నీలకంట ఆదేశాలమేరకు రైతు రాఘవేంద్ర ఇంటికి వెళ్లి రాఘవేంద్ర మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బజారి రెడ్డి, కోరిశెట్టి విశ్వనాథ్, సందీప్, ఇబ్రహీం, సయ్యద్ చాంద్, కదిరికోట రాజ్కుమార్, జస్వంత్లు పాల్గొన్నారు.

రచ్చబండ కార్యక్రమం సిగ్గుచేటు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఏనాడు పట్టణంలోని వార్డు ముఖాలు చూడని వైసీపీ నాయకులు నేడు రచ్చబండ పేరుతో వార్డుల్లో కార్యక్రమాలు నిర్వహించటం సిగ్గుచేటని టీడీపీ పట్టణ ఆర్గనైజింగ్ కార్యదర్శి కటారి రాజేంద్ర, తొమ్మిదో వార్డు అధ్యక్షులు ఇబ్రహీంలు అన్నారు. శనివారం పట్టణంలోని తొమ్మిదో వార్డులో టీడీపీ నాయకులు పర్యటించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, పట్టణంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ ఓర్వలేకపోతోందన్నారు. వైసీపీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకే రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. పీపీపీ విధానం ప్రగతికి సోపానమన్నారు. పీపీపీ విధానం ద్వార మెరుగైన అవకాశాలు లభిస్తాయని, త్వరగా కాలేజీల నిర్మాణం జరుగుతుందని, విద్యార్థులకు అధికంగా ఎంబీబీఎస్, పీడీ సీట్లు వస్తాయన్నారు. ఇది తెలుసుకోకుండా వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్లు రచ్చబండ పేరుతో ప్రభుత్వంపై బురదచల్లే విదంగా మాట్లాడటం సరికాదన్నారు. నాయకులు హాజీ, రఘు, ఖాజా, గూడ్సాబ్, జాను, ప్రవీణ్, రాహుల్, అనిల్, కృష్ణ, లక్ష్మన్న, షాకియా, సాధిక్లు పాల్గొన్నారు.

రైతులు మెలకువలు పాటించాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు తెల్ల కుసుమ పంట సాగులో మెలకువలు పాటించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి పేర్కొన్నారు. శనివారం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ఉచితంగా తెల్లకుసుమ పంట విత్తనాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తెల్ల కుసుమ పంట తక్కువ వర్షాపాతం ప్రాతాలకు అనుకూలమన్నారు. నూనెశాతం అధికంగా ఉండడం వలన ఆదాయం అధికంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు 200 మందికి పైగా రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సురేష్, ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బాణసంచా దుఖాణాదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ శేష ఫణి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాణసంచా దుఖాణాదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అగ్నిమాపక అధికారి రామాంజనేయులు, విద్యుత్ శాఖా ఏఈ ప్రసన్న ఆంజనేయులు, పట్టణ పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుఖాణాలను ఏర్పాటు చేసే సమయంలో తప్పకుండ అగ్నిమాపక, విద్యుత్ నియమాలను పాటించాలన్నారు. దుఖాణాలను దగ్గర దగ్గరగా ఏర్పాటు చేసుకోరాదన్నారు. నిత్యం దుఖాణాలను పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. సెల్ఫోన్ చార్జింగ్లను దుఖాణాల్లో పెట్టుకోరాదన్నారు. ఈ సమావేశంలో డీటీ వీరేంద్రగౌడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హిందూ సమాజం సంఘటితం కావాలి

నందవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హిందూ సమాజం సంఘటితం కావాలని ఎమ్మిగనూరు మున్సిపాల్ మాజీ కౌన్సలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ అన్నారు. నందవరంలో శనివారం విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు బేధం లేకుండా హిందూ సమాజం కోసం అందరం కలిసికట్టుగా పని చేయాలని ఐక్యత క్రమశిక్షణతో ప్రతి ఒక్కరు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని జిల్లా ప్రచార ప్రసార ప్రముఖ కసిరెడ్డి ఉపేంద్ర రెడ్డి, మంత్రాలయం నాయకులు గోవర్ధన్ గౌడ్, జగదీశ్, జింకల రవికూమార్, తోట రమేష్, చుక్క వీరేష్ , వినోద్, దోడ్డి హెమంత్, గురుజాల హనుమంతు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకారం

కౌతాళం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అన్నారు. కౌతాళంలోని బేగారు బసవన్న గుడిలో పురాణ ప్రవచనాలు ఉన్నాయని, వాటి నిర్వహణకు తన వంతు సాయంగా రూ.10వేల నగదును శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఎన్టీఆర్ నగర్లో చాకలి యంకన్న ఇంటి నుంచి జేకేఎల్ఎస్ పాఠశాల వరకు ఎలాంటి డ్రైనేజి కాలువ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోతుందని కాలనీవాసులు ఆయనకు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఎక్స్కవేటర్తో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కాలనీవాసులు, బసవన్న గుడి ఆలయ కమిటీ పెద్దలు చెన్నబసప్పకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాశీవిశ్వనాథ, టీడీపీ నాయకులు రాజబాబు, రహీమాన్, మంజునాథ, సిద్దు, రామచంద్ర ఉన్నారు.

భక్తులను వేధిస్తే చర్యలు

మంత్రాలయం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు గంధం బొట్లు పెడతామని, దానం చెయ్యమని యాచిస్తూ ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివాంజల్ అన్నారు. శనివారం మంత్రాలయంలో చిన్నపిల్లలు, యుక్త వయస్సు యువతీయువకులు, చంటిబిడ్డలను ఎత్తుకుని యాచిస్తున్నవారిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. మంత్రాలయం పరిసర ప్రాంతాల్లో దానంచేసేంత వరకు, బొట్టుపెట్టించుకునేంత వరకు భక్తుల వెంటపడి వేదిస్తూ ఉండడం, వారు నిరాకరిస్తే వారిపై శాపనార్థాలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో యాచకులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఈకౌన్సిలింగ్లో హెడ్కానిస్టేబుల్ లక్ష్మినారాయణ, నిర్మల పాల్గొన్నారు.

ఫోటో 18వైఎంజీ 5. ఆటో స్టాండ్ దగ్గర నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు, సీఐటీయు నాయకులు

చలానా పేరుతో వేధించడం సరికాదు

ఎమ్మిగనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి ఆటోలు తెచ్చుకొని ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులపై పోలీసులు చలానాల పేరుతో వేధింపులకు పాల్పడటం సరికాదని దీన్ని ఆపాలని సీఐటీయూ నాయకులు రాముడు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆటో స్టాండ్ దగ్గర నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ రాముడు, ఆటో యూనియన్ నాయకులు నబి, రాఘవలు మాట్లాడుతూ గత ప్రభుత్వం కొనసాగించిన ఆటో చలనాలను కూటమి ప్రభుత్వం సైతం కొనసాగించటం దారుణమన్నారు. జీవో 21ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.